సంపుటి : 10
సంచిక : 01
ఆదివారం
27 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.
SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT
CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వం వాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
తాజా వార్తలు మరియు విశ్లేషణలు
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మీ ఫోన్‌లో మా డిజిటల్ దినపత్రికను పొందండి.
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999

నిజం కోసం కలం... ప్రజల కోసం పత్రిక... | ప్రజాస్వామ్యం కోసం జర్నలిజం...

## విశ్వం వాయిస్

ప్రజాభి ప్రకుర.. సమాజం కోసం...

10th దశాబ్ది వేడుకలు

" ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే జర్నలిస్టుకు అతిపెద్ద అవార్డు "



# "కలం ఒక ఆయుధం కాదు... సమాజాన్ని చైతన్యపరిచే శక్తి



" నిజం కోసం కలం... ప్రజల కోసం పత్రిక
ప్రజాస్వామ్యం కోసం జర్నలిజం...

## ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే జర్నలిస్టుకు అతిపెద్ద అవార్డు
## విశ్వం వాయిస్ శతాబ్ది వేడుకలకు హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్













**రాయవరం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :**
ప్రజల గొంతుకగా, సామాజిక బాధ్యతతో పదేళ్లుగా నిరంతర సేవలందిస్తున్న "విశ్వం వాయిస్" దినపత్రిక దశాబ్ది వేడుకలు మండపేట నియోజకవర్గం రాయవరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరై, పత్రిక ఎడిటర్, చైర్మన్ ఖండవల్లి సునీల్ కుమార్, యాజమాన్యానికి, జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఒక పత్రికను ప్రారంభించడం కంటే దాన్ని పదేళ్ల పాటు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విజయవంతంగా కొనసాగించడం మరింత గొప్ప విషయమన్నారు. ఈ దశాబ్ది ప్రయాణం వెనుక సంపాదకులు, పాత్రికేయులు, సిబ్బంది చేసిన కృషి, త్యాగాలు, అంకితభావం ఉన్నాయని కొనియాడారు. పత్రిక నిర్వహణ వెనుక ఎన్నో నిద్రలేని రాత్రులు, ఎన్నో సవాళ్లు ఉంటాయని, వార్తలను సేకరించడం, నిజానిజాలు నిర్ధారించడం, ప్రజలకు సమయానికి చేరవేయడం చిన్న విషయం కాదన్నారు. ఆర్థిక ఇబ్బందులు, పోటీ, ఒత్తిళ్ల మధ్య కూడా ప్రజల కోసం నిలబడే సంపాదకుల సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఎడిటర్ కేవలం వార్తలను ప్రచురించే వ్యక్తి కాదు... సమాజానికి దిశానిర్దేశం చేసే బాధ్యతగల వ్యక్తి అన్నారు. పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమని, ప్రభుత్వాలు మారవచ్చుని, పాలకులు మారవచ్చుని, కానీ ప్రజాస్వామ్య విలువలు నిలవాలంటే స్వేచ్ఛాయుత మీడియా అవసరమని చెప్పారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే వారధిగా మీడియా పనిచేస్తుందని, బాధ్యతాయుతమైన జర్నలిజం సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఎండలోనైనా, వర్షంలోనైనా, విపత్తుల సమయంలోనైనా ముందుండి పనిచేసే జర్నలిస్టులు సమాజానికి వెలుగుదారులని కొనియాడారు. మంచి జర్నలిజం సమాజంలో మార్పుకు నాంది పలుకుతుందని పేర్కొన్న మంత్రి, జర్నలిస్టుల భద్రత, సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాత్రికేయుల ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పనిచేస్తోందని చెప్పారు. యువ జర్నలిస్టులకు మంత్రి ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వేగం కంటే వాస్తవం ముఖ్యమని గుర్తుంచుకోవాలని, వార్తల్లో నిజాయితీ, నిబద్ధత, సామాజిక బాధ్యత ఉండాలని సూచించారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా విశ్వసనీయతే జర్నలిజం యొక్క అసలైన బలమన్నారు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే జర్నలిస్టు సాధించే అతిపెద్ద అవార్డని పేర్కొన్నారు. పత్రిక ఒక వ్యాపారం కాదు... ప్రజల బాధలను పలికించే బాధ్యత. కలం ఒక ఆయుధం కాదు... సమాజాన్ని చైతన్యపరిచే శక్తి. ప్రజాస్వామ్యానికి పునాది ప్రజలు అయితే, ఆ ప్రజల గొంతుక మీడియా అని మంత్రి అన్నారు. పదేళ్లుగా ఆ గొంతుకను గంభీరంగా వినిపిస్తున్న విశ్వం వాయిస్ ఎడిటర్ అండ్ చైర్మన్ ఖండవల్లి సునీల్ కుమార్, ఆయన బృందానికి మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామీణ విలేకరిగా ప్రస్థానం ప్రారంభించి, రెండు తెలుగు రాష్ట్రాల్లో పత్రికను స్థాపించి విజయవంతంగా నిర్వహించడం ఎంతో కష్టతరమైన విషయమని కొనియాడారు. అనంతరం మంత్రి సుభాష్ కేక్ కట్ చేసి, ఎడిటర్ సునీల్ కుమార్‌కు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల పక్షాన కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఆదర్శంగా

## లలిత అసోసియేట్స్ ఎండీ ప్రసాద్ రెడ్డి - మంత్రి సుభాష్

**పేద మహిళకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేత**
**ఆపదలో ఉన్న మహిళ కుటుంబానికి అండగా నిలిచిన దాత ప్రసాద్ రెడ్డి**




**రాయవరం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గం రాయవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో ద్రాక్షారామం గ్రామానికి చెందిన అంగర సుమిత్రకు 2 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. భర్తను కోల్పోయి ముగ్గురు చిన్నారులతో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న సుమిత్ర కుటుంబానికి అండగా నిలుస్తూ లలిత అసోసియేట్స్ ఎండీ ప్రసాద్ రెడ్డి రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయానికి సంబంధించిన చెక్కును మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ సమాజంలో అవసరమైన వారికి చేయూతనివ్వడం గొప్ప మానవతా విలువ అని అన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన ప్రసాద్ రెడ్డి సేవాభావం అభినందనీయమని కొనియాడారు. వ్యాపార రంగంలో విజయవంతంగా కొనసాగుతూ, సమాజం పట్ల తన బాధ్యతను గుర్తించి నిరుపేదలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అంగర సుమిత్ర వంటి బాధిత కుటుంబాలకు అందిస్తున్న సహాయం వారికి ఆర్థిక భరోసాతో పాటు మానసిక ధైర్యాన్ని కూడా కల్పిస్తుందని మంత్రి తెలిపారు. సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన వారు తమకు చేతనైన సహాయాన్ని అందిస్తే మరెన్నో కుటుంబాలకు వెలుగులు నింపవచ్చని అన్నారు. రాయవరం మండలంలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేసి వారి భద్రత పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ చూపిన ప్రసాద్ రెడ్డి సేవా దృక్పథాన్ని మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్న ఆయన సేవలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వం వాయిస్ ఎడిటర్ ఖండవల్లి సునీల్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, జర్నలిస్టులు, గ్రామ పెద్దలు మరియు స్థానికులు పాల్గొని ప్రసాద్ రెడ్డి సేవలను అభినందించారు.

# ఆసియా క్రీడల కబడ్డీలో భారత్ గోల్డెన్ డబుల్..

■ పురుషుల, మహిళల ఫైనల్స్‌లో ఇరాన్‌పై ఘన విజయం ■ విజేతలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్
■ ఇది కబడ్డీ స్టైల్ 'డుబ్కీ' అంటూ చంద్రబాబు ప్రశంస ■ బలం, నైపుణ్యం, పోరాట స్ఫూర్తి అద్భుతమన్న నారా లోకేశ్



**అమరావతి, సెప్టెంబర్, 26, విశ్వం వాయిస్ న్యూస్** : ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో అద్భుత ప్రదర్శన చేశాయి. ఈ చారిత్రాత్మక విజయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేస్తూ జట్లకు అభినందనలు తెలిపారు. కబడ్డీలో భారత ఆధిపత్యం మరోసారి రుజువైందని వారు కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందిస్తూ, "కబడ్డీలో భారత ఆధిపత్యం డబుల్ గోల్డ్‌తో కొనసాగింది. మన మహిళల జట్టు తమ టైటిల్‌ను నిలబెట్టుకోగా, పురుషుల జట్టు కూడా ఐచి-నగోయాలో ఉత్కంఠభరిత విజయంతో మరో స్వర్ణాన్ని భారత్ ఖాతాలో చేర్చింది. ప్రపంచానికి సరైన కబడ్డీ స్టైల్ 'డుబ్కీ'ని రుచి చూపించారు. ఈ అద్భుత విజయం సాధించిన మన కబడ్డీ జట్టుకు నా అభినందనలు. మీ అందరినీ చూసి భారత్ గర్విస్తోంది" అని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సైతం భారత జట్లను ప్రశంసించారు. "భారత్‌కు డబుల్ గోల్డ్! ఆసియా గేమ్స్ ఛాంపియన్‌లుగా నిలిచిన మన పురుషుల, మహిళల కబడ్డీ జట్లకు హృదయపూర్వక అభినందనలు. రెండు జట్లు కూడా బలం, నైపుణ్యం, పోరాట స్ఫూర్తిని అద్భుతంగా ప్రదర్శించాయి. మీరు దేశం మొత్తం గర్వపడేలా చేశారు. జై హింద్!" అని లోకేశ్ తన సందేశంలో తెలిపారు. శనివారం జరిగిన ఫైనల్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌పైనే విజయం సాధించడం విశేషం. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లలో భారత క్రీడాకారులు అద్వితీయమైన ప్రతిభ కనబరిచి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ విజయాలతో కబడ్డీ క్రీడలో తమకు తిరుగులేదని భారత్ మరోసారి ప్రపంచానికి చాటి చెప్పింది.

# ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

● ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం ● ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
● తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల ● సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
● రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
● గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన

**అమరావతి, సెప్టెంబర్, 26, విశ్వం వాయిస్ న్యూస్** : భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి



ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.

'సర్' నోటీసులు.. అత్యవసరమైతే తప్ప

# వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు : ఈసీ




**సెప్టెంబర్, 26, విశ్వం వాయిస్ న్యూస్** : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. సర్ నోటీసులు అందుకున్న ఓటర్లు.. అత్యవసరమైన సందర్భాల్లో తప్ప వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపింది. 'సర్' కోసం ఫారం-6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డా.సుఖ్‌బీర్ సింగ్ సంధూ, డా.వివేక్ జోషి నేడు దిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. 'సర్'పై భిన్నాభిప్రాయాల అంశం తీవ్ర దుమారం రేపిన వేళ.. ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి ఎన్నికల కమిషనర్లు రాసిన లేఖ.. ఈసీ లేదా ఐటీ విభాగాల విధానపరమైన అంశానికి సంబంధించినది కాదని, ఈసీకి డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారి పనితీరుకు సంబంధించిందని ఎన్నికల సంఘం వివరించింది. సీఈసీ, ఎన్నికల కమిషనర్ల సమావేశం అనంతరం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

"బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. తమ పేర్లు నమోదు కాకుండా మిగిలిపోయిన వారు, యువకులు, మొదటిసారి ఓటు వేసేవారు.. నిరంతర అప్‌డేషన్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు కోసం సంబంధిత ఈఆర్‌వోకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఓటర్ల నమోదుకు ఎన్నికల అధికారులు తక్షణమే స్పెషల్ డ్రైవ్ ప్రారంభించనున్నారు.

దేశవ్యాప్తంగా 'సర్' నిర్వహణ సహా ఈ మధ్య కాలంలో ఈసీ అనేక నిర్ణయాలు తీసుకుంది. బిహార్ నుంచి మొదలు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కోసం గతేడాది జూన్ 24నాటి ఆదేశాలు ఎన్నికల కమిషన్ ఏకగ్రీవ ఆమోదంతోనే జారీ అయ్యాయి. దీన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా సమర్థించింది" అని ఈసీ తెలిపింది.

గోవాలో 97 మంది అర్హులకు తుది ఓటర్ల జాబితాలో చోటుదక్కకపోవడంపై స్పందిస్తూ.. "ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హుల నుంచి దరఖాస్తులు సేకరణకు ఇంటింటికీ వెళ్లాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులను గోవా సీఈవో ఆదేశించారు. ఆ 97 మంది ఓటర్లలో ఇప్పటికే 81 మంది 'ఫారం-6' నింపారు" అని వెల్లడించింది.

మన్మోహన్‌సింగ్ జీవితం జెన్‌జీ సహా..

# అన్ని తరాలకు స్ఫూర్తి : సీఎం రేవంత్



**హైదరాబాద్, సెప్టెంబర్, 26, విశ్వం వాయిస్ న్యూస్** : మౌనమే భాషగా మార్చుకొని అద్భుతమైన పరిపాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ విప్రో సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మన్మోహన్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. "దేశం రాజకీయ సంక్షోభంలో ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్ పగ్గాలు చేపట్టారు. భూగరిష్ఠ పరిమితి చట్టాలు చేయడంలో ఆనాడు భూమి ఉన్నవాళ్లే కీలకపాత్ర పోషించారు. ఆ లోపాన్ని సరిదిద్దేలా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భూ సేకరణ చట్టాన్ని చేసింది. ప్రభుత్వం భూ సేకరణ చేస్తే నిర్వాసితుల ఆమోదం తప్పనిసరి చేశారు. అలాంటి గొప్ప నేతకు భారతరత్న ఇవ్వకపోవడం శోచనీయం. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇచ్చేందుకు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటి? పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవిస్తేనే.. మనకు విజ్ఞత ఉన్నట్టు. మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా. ఆయన జీవితం జెన్‌జీ సహా అన్ని తరాలకు ఒక స్ఫూర్తి. మన్మోహన్ సింగ్, పీవీ నర్సింహారావు ఆలోచనల ఫలితమే.. సరళీకృత ఆర్థిక విధానం. ఆనాడు ఇద్దరూ కలిసి తీసుకున్న నిర్ణయాలే ఇవాళ దేశాన్ని పటిష్ఠంగా నిలబెట్టాయి. వారిద్దరి నిర్ణయాల వల్లే ఇలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు ఏర్పడ్డాయి" అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే

# జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

ఓటర్ల జాబితా సవరణపై జగన్ ది ద్వంద్వ వైఖరి అంటూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఫైర్
గతంలో కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటమేంటని ప్రశ్న
ఈసీల నియామకంపై మాట మార్చడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీత
2029లో కాంగ్రెస్‌తో పొత్తు కోసమే జగన్ వ్యూహాలని ఆరోపణ



**అమరావతి, సెప్టెంబర్, 26, విశ్వం వాయిస్ న్యూస్** : వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ది అవకాశవాద, ద్వంద్వ వైఖరి అని ఆరోపిస్తూ సోషల్ మీడియా వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. ఆయన రాజకీయ సౌలభ్యం కోసం వైఖరులు మార్చుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇదే ప్రక్రియను ప్రామాణికంగా తీసుకున్నారని లావు గుర్తుచేశారు.

"ఎస్ఐఆర్ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మీ పార్టీ ఎమ్మెల్సీ లెళ్ల అప్పిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం వాస్తవం కాదా? కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటంలోని ఆంతర్యమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు.

అదేవిధంగా, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగిస్తూ 2023లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టానికి వైసీపీ మద్దతు ఇచ్చిందని లావు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు, ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా ప్యానెల్‌లో ఉండాలని జగన్ డిమాండ్ చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

ఈ ఆకస్మిక మార్పుల వెనుక రాజకీయ వ్యూహం ఉందని లావు అనుమానం వ్యక్తం చేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తన మాతృ సంస్థ అయిన కాంగ్రెస్‌తో రాజకీయంగా కలవాలనే ఉద్దేశంతోనే జగన్ ఇలా తన వైఖరిని మార్చుకుంటున్నారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

లెక్కలేనంత మంది

# వైసీపీ నేతలపై కేసులు పెట్టారు

నిరసనల్లో పాల్గొన్న వైసీపీ నేతలపై కేసులు ఎత్తివేయాలన్న అంబటి
పోలీసులు మితిమీరిన చర్యలకు పాల్పడ్డారని ఆరోపణ
కోర్టులు అక్షింతలు వేసినా పోలీసుల తీరు మారడం లేదని విమర్శ



**విజయవాడ, అమరావతి, సెప్టెంబర్, 26, విశ్వం వాయిస్ న్యూస్** : డీఎస్పీ అక్రమాలపై నిరసన కార్యక్రమాలు చేపట్టిన వైసీపీ నేతలు, కార్యకర్తలపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబుకు వినతిపత్రం అందించారు. ఘటనకు సంబంధం లేని వారిపై కూడా కేసులు పెట్టారని సీపీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం అంబటి మీడియాతో మాట్లాడుతూ... లెక్కలేనంత మంది వైసీపీ నేతలపై కేసులు పెట్టారని అన్నారు. నిరసన సమయంలో పోలీసులు మితిమీరిన చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. విజయవాడలో మల్లాది విష్ణు ధర్నా చేస్తే ఆయనపై కోడిగుడ్లతో దాడి చేశారని... దాడి చేసిన వారిపై ఒక్క కేసు కూడా పెట్టలేదని మండిపడ్డారు. కోర్టులు అక్షింతలు వేసిన పోలీసుల తీరు మారడం లేదని అంబటి విమర్శించారు. తప్పుడు కేసులు పెడుతూ పోలీసులు అభాసుపాలు అవుతున్నారని ఎద్దేవా చేశారు. ఎస్సీ నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై రౌడీషీట్లు తెరవడం ఏ ప్రాతిపదికన జరుగుతోందని ప్రశ్నించారు. మంత్రి నారా లోకేశ్ మామూళ్ల దందా నడిపిస్తున్నారని... ఆయనపై కూడా రౌడీషీట్ పెట్టాలని అన్నారు.

# సైబర్ ముప్పులపై అప్రమత్తత అవసరం

## సైబరాబాద్ పోలీస్ కమిషనర్

**హైదరాబాద్, సెప్టెంబర్, 26, విశ్వం వాయిస్ న్యూస్** : ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికతలతో పాటు పెరుగుతున్న సైబర్ ముప్పులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేశ్ అన్నారు. 'ఐసాకా హైదరాబాద్ చాప్టర్' 26వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన 'ఫ్యూజన్-2026' వార్షిక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా రక్షణ, సైబర్ సెక్యూరిటీ, రిస్క్ తదితర అంశాలపై చర్చించారు. డేటా రక్షణ, సైబర్ రిస్క్, డిజిటల్ మోసాల నివారణకు సంస్థలు, నిపుణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. డీప్‌ఫేక్ వీడియోలు, ఓటీపీ ఆధారిత లావాదేవీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసాకా హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు సుజయ్ గంకిడి, ఉపాధ్యక్షుడు రాజ్ పవార్, సైబర్ సెక్యూరిటీ, ఆడిట్, రిస్క్ రంగాలకు చెందిన నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

నవంబర్ తర్వాత ఇరాన్‌పై మళ్లీ బాంబులు

# శాంతి ప్రణాళికను తిరస్కరించిన ట్రంప్

**సెప్టెంబర్, 26, విశ్వం వాయిస్ న్యూస్** : కాల్పుల విరమణ కోసం ఇరాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. నవంబరులో అగ్రరాజ్యంలో జరగనున్న మధ్యంతర ఎన్నికల తర్వాత.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసేందుకు సిద్ధమవ్వాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా తమ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే.. అందుకు బదులుగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు అణుచర్చలను పునరుద్ధరిస్తామని టెహ్రాన్ ప్రతిపాదించింది. ఖతార్ మధ్యవర్తుల ద్వారా ఈ శాంతి ప్రణాళికను అగ్రరాజ్యానికి తెలియజేశామని.. దీనిపై ఒప్పందం కుదిరితే హర్మూజ్‌ను ఏడు రోజుల్లో తిరిగి తెరుస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, దీనిపై ట్రంప్ విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. శాంతి ప్రణాళికకు ఇరాన్ కట్టుబడి ఉంటుందా..? అనే దానిపై అమెరికా అధ్యక్షుడికి పలు సందేహాలు ఉన్నాయని సదరు కథనాలు పేర్కొన్నాయి.

**'ట్రంప్' జలసంధి..**

ఇదిలా ఉండగా.. హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ తమకే ఉందని ట్రంప్ పదే పదే వాదిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో అడుగు ముందుకేసి.. 'ట్రూత్ సోషల్'లో ఓ పోస్ట్ చేశారు. హర్మూజ్ పేరుకు బదులుగా 'ట్రంప్ జలసంధి' అని రాసి ఉన్న మ్యాప్ ఫొటోను షేర్ చేశారు. ప్రస్తుతం హర్మూజ్‌లో అమెరికా దిగ్బంధనంతో పాటు ఇరాన్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. దీంతో నౌకల రాకపోకలకు ఇబ్బంది కొనసాగుతూనే ఉంది. తమ ఆస్తులను విడుదల చేయాలని.. చమురుపై ఆంక్షలను తొలగించి, సైనిక చర్యకు ముగింపు పలకాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. అలా జరిగితే హర్మూజ్‌లో స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం లభిస్తుందని చెబుతోంది.

# ఎడిటర్ వాయిస్

## కొత్త జడ్పీ ఛైర్మన్లకు కుర్చీల సమస్య.. 15 జడ్పీలకు భవనాలు ఏవీ?

ఏపీలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న జిల్లా పరిషత్ కార్యాలయాలకు మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోందని అంటున్నారు. రాష్ట్రంలో జిల్లాల విభజన తర్వాత కొత్త జిల్లా పరిషత్తులు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం 13 జిల్లా పరిషత్తులు ఉండగా, వీటిని 28 జిల్లా పరిషత్తులుగా విభజించాల్సివుంది. ఇక పాత జిల్లా పరిషత్తులకు అన్నిరకాల హంగులతో కార్యాలయాలు ఉన్నాయి. కానీ కొత్తగా ఏర్పాటు చేయనున్న జిల్లా పరిషత్తుల విషయంలోనే గందరగోళం నెలకుందని అంటున్నారు. కొత్తగా 15 జిల్లా పరిషత్తు కార్యాలయాలు ఏర్పాటు చేయాల్సివుండగా, పోలవరం జిల్లా కేంద్రమైన రంపచోడవరం, అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరు, మార్కాపురం, మదనపల్లె వంటి కొత్త జిల్లాల్లో జడ్పీలకు సరిపడా భవనాల కొరత ఉందని అంటున్నారు.

రాష్ట్రంలో గత ప్రభుత్వంలోనే 26 జిల్లాలు ఏర్పాటు అయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్కాపురం, పోలవరం జిల్లాల ఏర్పాటుతో జిల్లాల సంఖ్య 28కి చేరిన విషయం తెలిసిందే. అయితే గత ప్రభుత్వంలో జిల్లాలు ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్తుల విభజన మాత్రం చేయలేదని చెబుతున్నారు. దీనికి కారణం జిల్లాల ఏర్పాటుకు ముందే వాటికి పాలక వర్గాలు ఉండటం వల్ల సాధ్యం కాలేదని చెబుతున్నారు. ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గం పదవీకాలం ఉండగా, వాటిని విభజించలేని పరిస్థితి ఉండటంతో దాదాపు నాలుగున్నరేళ్లుగా కొత్త జిల్లాలు కూడా ఉమ్మడి జిల్లా పరిషత్తుల పరిధిలోనే ఉండేవి. ఇప్పుడు జడ్పీ పాలకవర్గాల పదవీకాలం పూర్తవడంతో కొత్త జిల్లా పరిషత్తుల ఏర్పాటుకు మార్గం సుగమం అయిందని అంటున్నారు.

రెండు రోజుల క్రితం పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం కొత్తగా 15 జిల్లా పరిషత్తు కార్యాలయాల ఏర్పాటుపై దృష్టి పెట్టింది. కొత్త జడ్పీలకు అధికారుల బదిలీని మొదలుపెట్టిందని అంటున్నారు. అయితే ఇంకా ఈ కార్యక్రమం పూర్తిస్థాయిలో జరగలేదని చెబుతున్నారు. మరోవైపు ఎన్నికలు తరుముకొస్తుండటం వల్ల వచ్చే నెల, నెలా 15 రోజులకల్లా కొత్త కార్యాలయాలు, సిబ్బంది బదిలీ చేయాల్సివుందని అంటున్నారు. అయితే రాష్ట్రంలో చాలా చోట్ల జిల్లా కేంద్రాలుగా ఉన్న పట్టణాల్లో జడ్పీ కార్యాలయాల ఏర్పాటుకు తగిన భవనాలు లేవని చెబుతున్నారు. కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన తర్వాత గత ప్రభుత్వం కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కానీ కొత్త కార్యాలయాల నిర్మాణంపై దృష్టి పెట్టలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పుడు జడ్పీల విభజన తర్వాత సిబ్బంది ఎక్కడ కూర్చోవాలన్న అంశం కూడా పెద్ద సమస్యగా మారిందని అంటున్నారు.

వచ్చేనెలలో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్న ప్రభుత్వం ముందుగా కొత్త జిల్లాల్లో జడ్పీలకు భవనాలు సమకూర్చే విషయమై దృష్టి పెట్టాలని పరిశీలకులు సూచిస్తున్నారు. జిల్లాల విభజన జరిగి నాలుగేళ్లు అవుతున్నా, జిల్లా ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్సులు నిర్మాణంపై ప్రభుత్వ పెద్దలు దృష్టి పెట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొత్త జిల్లాలలో చాలా కార్యాలయాలు ప్రైవేటు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. ఇక కొత్తగా ఏర్పాటు అయ్యే జడ్పీ కార్యాలయాలకు కూడా ప్రైవేటు భవనాలే దిక్కుగా చెబుతున్నారు. ఇక ఎన్నికల తర్వాత కొలువుదీరే జడ్పీ ఛైర్మన్లకు ఎక్కడ కూర్చోబెడతారనేది కూడా అంతుచిక్కడం లేదని అంటున్నారు. ఏదిఏమైనా కేబినెట్ ర్యాంకుతో కొత్త బాధ్యతలు చేపట్టే జడ్పీ ఛైర్మన్లు పదవులతోపాటు కుర్చీలు కూడా తమ వెంటే తీసుకువెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## స్కూల్ టీచర్‌పట్ల ప్రిన్సిపల్ అసభ్య ప్రవర్తన

### ప్రశ్నించిన వారిపై కత్తితో దాడి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** స్కూల్‌లో పనిచేసే టీచర్ పట్ల ప్రిన్సిపల్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన హైదరాబాద్ సూరారంలోని సాయిబాబా నగర్‌లో చోటుచేసుకుంది. అవమానంతో స్కూల్‌కు వెళ్లడం మానేసిన టీచర్‌ని కుటుంబసభ్యులు ఆరా తీయడంతో జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న మహిళ పట్ల అదే పాఠశాల ప్రిన్సిపల్ అసభ్యంగా ప్రవర్తిస్తూ, ఆమె పేరును డ్రీమ్‌గర్ల్ అని మొబైల్‌లో సేవ్ చేసుకున్నాడు. మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న ప్రిన్సిపల్ వ్యవహారశైలితో ఆమె పాఠశాలకు వెళ్లడం మానేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆరాతీయగా ప్రిన్సిపల్ వేధింపుల విషయం బయటకు వచ్చింది. దీంతో బాధిత టీచర్ సోదరుడు, కాలనీ వాసులు పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపల్‌ను నిలదీడయంతో వారిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు స్కూల్‌లో జరుగుతున్న గొడవను చూసి ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కత్తితో దాడిచేసిన కేసులో ప్రిన్సిపల్‌పై, స్కూల్‌పై మూకుమ్మడి దాడి చేశారని కాలనీవాసులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

### బద్వేల్ రైతు బజార్‌లో దాష్టీకం..

## మహిళా రైతుపై దాడి



**గోపవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బద్వేల్ రైతు బజార్‌లో కూరగాయలు విక్రయించే విషయంలో.. ఓ వ్యక్తి మహిళా రైతుపై దాడి చేశాడు. జుట్టు పట్టుకుని కొట్టడంతో మహిళ కన్నీరు మున్నీరైంది. రైతు బజార్లో దళారి వ్యవస్థ కొనసాగడం, రైతు కష్టపడి పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి కూడా దళారులకు డబ్బులు ముట్టజెప్పాల్సి రావడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, దీనిపైన బద్వేల్ మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని సదరు రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' బద్వేల్ మున్సిపల్ కమిషనర్ కృష్ణతో ప్రస్తావించగా.. ఇక్కడ దళారుల వ్యవస్థ ఏది లేదని, అలాంటిది ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొని వస్తే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## కోనేరులో మునిగి ముగ్గురు చిన్నారుల మృతి

**గరివిడి, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం బుధరాయవలసలో విషాదం చోటుచేసుకుంది. గ్రామంలోని కోనేరులో స్నానానికి వెళ్లిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతిచెందారు. మృతుల్లో శంకరపు వెంకటేష్ (7), సారిది చందు (7), మండల హేమచంద్రరావు (7) ఉన్నారు. ముగ్గురు చిన్నారుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## మద్యం మత్తులో అవ్వను చంపిన మనవడు

**పెద్ద దోర్నాల, విశ్వం వాయిస్ న్యూస్ :** మార్కాపురం జిల్లా దోర్నాల మండలం తూర్పు బొమ్మలాపురంలో దారుణం జరిగింది. పసుపులేటి లక్ష్మమ్మ అనే ఓ వృద్ధురాలిని మద్యం మత్తులో మనవడే పెట్రోల్ పోసి నిప్పంటించి చంపేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వ్యసనాలకు బానిసైన మట్టుపల్లి రాములు కుటుంబ సభ్యులతో నిత్యం గొడవ పడుతుండేవాడు. దీంతో అతని భార్య మూడు నెలల క్రితం ఇల్లు వదిలి వెళ్ళిపోయింది. శుక్రవారం రాత్రి మద్యం తాగి వచ్చిన అతను.. తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. దీంతో వారు కూడా ఇంట్లోంచి బయటికి వెళ్లిపోయారు. ఆ సమయంలో మంచంపై నిద్రిస్తున్న అవ్వ లక్ష్మమ్మ(81)పై పెట్రోల్ పోసి అతడు నిప్పంటించాడు. దీంతో ఆమె చనిపోయింది. శనివారం ఉదయం మృతురాలి కూతురు, అల్లుడు వచ్చి చూడగా పూర్తిగా కాలిపోయిన స్థితిలో కనిపించింది. వారు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. సీఐ అజయ్ కుమార్ ఎస్ఐ నాగరాజులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భర్త ఇతర మహిళలతో నృత్యం చేశాడని.. భార్య ఆత్మహత్య



**కాసిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తన భర్త ఇతర మహిళలతో కలిసి డ్యాన్స్ చేశాడని ఆవేదన చెందిన భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో చోటుచేసుకుంది. దేవాపూర్ ఎస్సై గంగారాం తెలిపిన వివరాల ప్రకారం.. కాసిపేట మండలం సోనాపూర్ బాదుగూడకు చెందిన సంధ్య (23)కు.. అదే గ్రామ పరిధిలోని దొడ్డిగూడేనికి చెందిన జంగుతో నాలుగేళ్ల కిందట వివాహమైంది. గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకల్లో భాగంగా బుధవారం జంగు కొందరు మహిళలతో కలిసి నృత్యం చేశాడు. దీంతో సంధ్య మనోవేదనకు గురై గురువారం ఉదయం ఇంట్లోనే పురుగుమందు తాగారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. శుక్రవారం మృతి చెందారు.



విశ్వ వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు








ఆదివారం, 27 సెప్టెంబర్, 2026



www.viswamvoice.com
సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత
www.viswamvoice.com


11 రోజులుగా దీక్ష చేస్తున్న

# వీఆర్వోలకు జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి సంఘీభావం

**వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి: చిర్ల జగ్గిరెడ్డి - పే స్కేల్, నామినీల రెగ్యులరైజేషన్, ప్రమోషన్లు కల్పించాలి**

**గ్రామాల కోసం సేవలందించిన వీఆర్ఏల పోరాటానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది**




**కొత్తపేట, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన దీక్షలు 11వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో, వారి పోరాటానికి మద్దతుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి ఈ రోజు కొత్తపేట మెయిన్ సెంటర్లో ఏర్పాటుచేసిన దీక్షా శిబిరానికి వెళ్లి వీఆర్ఏలకు సంఘీభావం తెలిపారు. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వీఆర్ఏలు తమ సంఘాల అధ్యక్షులు భీమశంకర్, సత్యనారాయణ, ఇస్సాక్, లవరాజు తదితరుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలను, డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. 11 రోజులుగా ఎండను, వర్షాన్ని, కుటుంబ పరిస్థితులను లెక్కచేయకుండా తమ న్యాయమైన హక్కుల కోసం వీఆర్ఏలు దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు.గ్రామస్థాయిలో ప్రభుత్వ పరిపాలన, సంక్షేమ కార్యక్రమాల అమలులో వీఆర్ఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం, ఇళ్ల స్థలాల పరిశీలనలో సహకరించడం, ప్రభుత్వ భూములు, ఆస్తుల పరిరక్షణలో విధులు నిర్వహించడం, రెవెన్యూ వ్యవస్థకు సంబంధించిన అనేక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం వంటి బాధ్యతలను వీఆర్ఏలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలోనూ, తుఫాన్లు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ ప్రజల కోసం తమ కుటుంబాలను సైతం పక్కనపెట్టి సేవలందించిన వీఆర్ఏలను ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంతకాలం గ్రామ ప్రజల కోసం సేవలందించిన వారికి న్యాయమైన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.వీఆర్ఏలు ప్రభుత్వం ముందు ఉంచుతున్న ప్రధాన డిమాండ్లు న్యాయబద్ధమైనవేనని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, వీఆర్ఏలుగా పనిచేసిన తల్లిదండ్రుల అనంతరం వారి స్థానంలో నామినీలుగా విధులు నిర్వహిస్తున్న అర్హులైన వారిని రెగ్యులరైజ్ చేయాలని, అర్హత ఉన్న వీఆర్ఏలకు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రమోషన్ అవకాశాలు కల్పించాలని కోరుతున్నారని తెలిపారు. ప్రస్తుత పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, కుటుంబ ఖర్చుల నేపథ్యంలో నెలకు లభిస్తున్న గౌరవ వేతనం సరిపోని పరిస్థితి ఉందని అన్నారు. రోజువారీ కూలీ సైతం గణనీయంగా పెరిగిన పరిస్థితుల్లో గ్రామస్థాయిలో నిరంతరం ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలకు గౌరవప్రదమైన వేతనం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం గుర్తుచేసుకుని, వీఆర్ఏలతో చర్చలు జరిపి వారి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.11 రోజులుగా వీఆర్ఏలు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం వీఆర్ఏలు అర్ధనగ్న ప్రదర్శనలు, వరద నీటిలో నిరసనలు వంటి తీవ్ర నిరసన కార్యక్రమాలకు దిగాల్సిన పరిస్థితి రావడం ఆవేదనకరమన్నారు. సమస్యను రాజకీయ కోణంలో చూడకుండా మానవతా దృక్పథంతో ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. వీఆర్ఏల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని చిర్ల జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరిచి వీఆర్ఏ సంఘాలతో చర్చలు జరిపి, పే స్కేల్, నామినీల రెగ్యులరైజేషన్, ప్రమోషన్లతో పాటు వారి ఇతర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల

# ప్రజా సేవకు గుర్తుగా అంగన్‌వాడీ ఉత్సవం

**అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా సేవా సంకల్ప అభియాన్ మహోత్సవం**



**రావులపాలెం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవను పురస్కరించుకుని కొత్తపేట ఐసిడిఎస్ సిడిపిఓ గజలక్ష్మి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ మహోత్సవం కార్యక్రమాన్ని రావులపాలెంలోని నెహ్రూ వీధి, శెట్టి బలిజ రామాలయం, ఆదిలక్ష్మి నగర్ అంబేద్కర్ నగర్లో గల అంగన్వాడి కేంద్రంలలో శనివారం అంగన్వాడి ఉత్సవం పండగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.చిన్నారులతో పాటు స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రావులపాలెం బాలికల పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ కోట సోమేశ్ మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం ద్వారా గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలను చేపట్టడంతో పాటు బాలింతలు చిన్నారులకు పోషక ఆహారాన్ని అందిస్తున్నారని వాటిని తీసుకోవడం వల్ల పరిపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని అన్నారు సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి సేవా భావంతో పనిచేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలు ప్రజల్లో సేవా స్ఫూర్తిని పెంపొందిస్తున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో కొవ్వూరి అచ్చిరెడ్డి, వడ్లమూడి రామారావు, మహిళా పోలీస్ అంగన్వాడి టీచర్లు పి లక్ష్మీ కళ, వై ఎస్తేరు రాణి, జావన మహేశ్వరి, పి విజయలక్ష్మి,సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల చట్టం

# ప్రభుత్వ సంక్షేమ పథకాల అవగాహన కార్యక్రమం



**రావులపాలెం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలమూరు మండలం ఆలమూరు గ్రామంలో పార సంస్థ సిబిఆర్ కోఆర్డినేటర్ బడుగు మహిమారావు ఆధ్వర్యంలో ఆలమూరు పంచాయతీ కార్యాలయం నందు 2016 దివ్యాంగుల చట్టం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగా రిసోర్స్ పర్సన్ గా హాజరైన ల్యాంప్ సంస్థ అడ్వకేసి కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ గారు దివ్యాంగులకు చట్టం, ప్రభుత్వ పథకాల , 2016 చట్టంలో 21 యొక్క రకాల దివ్యాంగులు ట్రైన్ పాస్ బస్సు , ఏ కేటగిరి వారు దివ్యాంగుల పరిధిలోకి వస్తారనేది , 15000 పింఛన్ ఎవరు అర్హులు స్కూటీలు ఎవరికి ఇస్తారు దాని యొక్క అర్హతలు, ఎవరూ కూడా ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా మీ హక్కులని మీరు కాపాడుకోవాలని . సదరం స్లాట్ బుకింగ్ ముందు ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవాలని, సదరం రీ అసెస్మెంట్ కి వెళ్లిన అమలాపురం వెళ్లిన వారికి ఇంతవరకు సర్టిఫికెట్స్ రాలేదని ఆ విషయాన్ని మేము కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళాము అన్నారు. చట్ట ప్రకారం 40 శాతం అంగవైకల్యం ఉంటే అర్హులని, ఎవరికైనా ఉపకార పరికరాలు అవసరమైతే ఆన్లైన్లో పెట్టుకుంటే ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని అనే విషయాలు పై అవగాహన కల్పించారు. ఇంకా 15000 అర్హులైన వారు చాలామంది ఉన్నారు (మంచానికి పరిమితమైన వారు) మరియు దివ్యాంగుల వివాహ ప్రోత్సాహ బహుమతి , శ్రీ అసెస్మెంట్ అని పెట్టి అంగవైకల్య శాతాన్ని తగ్గించటం, బహుళ వికలాంగత్వం, సదరం సర్టిఫికెట్స్ లో పేర్లు తప్పులు, పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. తదుపరి దివ్యాంగులతో గ్రామ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు58మంది , పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# నగరంలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు

**ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం - రూ.54 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్**

**రెండు రోజుల వర్షాలే నగరంలో మార్పుకు నిదర్శనం - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - 50 మందికి సీఎంరిలీఫ్ చెక్కులు పంపిణీ**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** హెచ్ఏఎం నిధులతో నగరంలో రూ.300 కోట్లతో భారీ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. రహదారులు, డ్రెయిన్లు, సెంట్రల్ మీడియన్లు, వీధి దీపాలు, పార్కులు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నారని వివరించారు. ఈ మేరకు కొత్తపేటలోని రౌతు తాతాలు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల్లోనూ నగరంలోని అనేక ప్రాంతాల్లో గతంలో ఎదురయ్యే స్థాయిలో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. సం వత్సరాలుగా ఉన్న సమస్యలను ఒక్కరోజులో పరిష్కరించడం సాధ్యం కాదని, ఒక్కో ప్రాంతాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపడుతున్నామని చెప్పారు. బోధి స్కూల్ ప్రాంతంలో గతంలో వర్షం పడితే తీవ్రంగా నీరు నిలిచిపోయేదన్నారు. ఈ సమస్య పరిష్కా రానికి కల్వర్టు విస్తరణ, రోడ్డు ఎత్తు పెంపు, మేజర్ డ్రైన్ల నిర్మాణం, అనుసంధాన డ్రైన్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. స్వతంత్ర హాస్పిటల్ జంక్షన్ వరకు రోడ్డు ఎత్తు పెంచడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరి చామని, ఫారెస్ట్ కల్యాణ మండపం వైపు మేజర్ డ్రైన్ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ పనుల ఫలితంగా భారీ వర్షం కురిసినప్పటికీ నీరు ఎక్కువసేపు నిలవకుండా బయటకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటీవల రామచంద్రా రావుపేట ప్రాంతంలో వర్షపు నీటి సమస్యను స్వయంగా పరిశీలించానని చెప్పారు. 35, 36, 39వ వార్డులకు సంబంధించిన ప్రాంతాల్లో మేజర్ కల్వర్టులు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో వర్షం పడితే మోకాళ్ల లోతు నీరు నిలిచేదని, ప్రస్తుతం 10-15 నిమిషాల్లోనే నీరు వెళ్లిపోతున్నట్లు స్థానికులు చెబు తున్నారన్నారు.

**హైటెక్ బస్‌స్టాండ్... కంబాలచెరువు ప్రాంతాలకు రూ.25 కోట్ల ప్రతిపాదన**

హైటెక్ బస్‌స్టాండ్ వద్ద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అక్టోబర్ చివరి నాటికి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కంబాలచెరువు జంక్షన్ నుంచి రామచంద్రరావు పేట, తుమ్మలావ ప్రాంతాల వరకు ముంపు సమస్య పరిష్కారానికి సుమారు రూ.25 కోట్లతో పనులు ప్రతిపాదించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదించిన సుమారు రూ.300 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తయ్యాయని, ఆయా పనులను దశలవారీగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జేఎన్ రోడ్డులో బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఎదురుగా జీవీకే హాస్పిటల్ సమీపంలోని డ్రైన్ నిర్మాణానికి సుమారు రూ.1.80 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. వీఎల్ పురం ప్రాంతంలో డ్రైన్లు, రోడ్ల విస్తరణ చేపట్టామని, పాత యమహా షోరూమ్ మీదుగా వెళ్లే డ్రైన్‌కు రూ.80 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అన్నపూర్ణమ్మపేట గేట్ నుంచి రెల్లిపేట వరకు 20 ఏళ్లుగా రోడ్డు, డ్రైనేజీ సమస్య ఉందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్కడ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. 29వ వార్డులో గేట్ నుంచి సోమాలమ్మ తల్లి ఆలయం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.63 లక్షలు మంజూరయ్యాయని, పుష్కర నిధులతో పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. జాంపేట బ్రిడ్జి నుంచి గీతా అప్సర, రంబా థియేటర్ ప్రాంతం, డీలక్స్ సెంటర్ మీదుగా నాగులచెరువు మార్కెట్ జంక్షన్ వరకు 28, 29, 33వ వార్డులను కలిపే బీటీ రోడ్డుకు రూ.1.07 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.







# అమలాపురంలో ఘనంగా 5కే రెడ్ రన్

## హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహనకు 140 మంది యువతీ యువకుల పరుగు




**అమలాపురం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై యువతలో అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపై చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా అమలాపురంలో శనివారం ఉదయం 5కే రెడ్ రన్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, తాడేపల్లి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ/ఎయిడ్స్ (దిశ), జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భట్నవిల్లి హైవే వద్ద ఉదయం 6 గంటలకు ప్రారంభమైన 5 కిలోమీటర్ల పరుగు పోటీల్లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన 17 నుంచి 25 ఏళ్ల వయస్సు గల 140 మంది యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. పురుషుల విభాగంలో రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన సి.హెచ్. వెంకట ప్రతాప్ ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, అదే కళాశాలకు చెందిన ఎం. జయసాగర్ ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు సాధించారు. మహిళల విభాగంలో ఎస్‌కేవీటీ కళాశాలకు చెందిన టి. సురేఖ ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, కొత్తపేట వి.కె.వి. డిగ్రీ కళాశాలకు చెందిన పి. శిరీష ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి 5కే రెడ్ రన్ పోటీలకు పంపించనున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డా. శ్రీనివాస్ తెలిపారు.

### విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై క్విజ్ పోటీలు

విద్యార్థుల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్, లైంగిక సంక్రమిత వ్యాధులపై అవగాహన పెంపొందించేందుకు మిరియం డిగ్రీ కళాశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 8, 9, 11వ తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో అమలాపురం విద్యానిధి ఐఐటీ టెక్నాలజీ స్కూల్‌కు చెందిన సి.హెచ్. కావ్య అమృత, బి. ఫల్గుని ప్రథమ బహుమతి సాధించారు. కొంకపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన కె.శ్రీ మంజుష్, పి. లాస్యశ్రీ ద్వితీయ బహుమతి, ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన యు. నవ్యశ్రీ, ఎన్. అనిత తృతీయ బహుమతి పొందారు. ముమ్మిడివరం ఎం.జి.ఆర్. కళాశాలకు చెందిన డి. సాయి, సి.హెచ్. లక్ష్మీ స్వరూపం కన్సోలేషన్ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాకో సాంకేతిక నిపుణురాలు నాజియా హుస్సేన్, దిశ క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ ఎ. బుజ్జిబాబు, సీపీఓ జి. రామానాయుడు, నాకో సహయోగి నల్లి శ్రీనివాస్, దిశ మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ ఆఫీసర్ ఎం.వి. రత్నరాజు, జేకేడబ్ల్యూఎస్ టీఐ-ఎన్‌జీఓ ప్రాజెక్ట్ మేనేజర్ జి. శ్రీను, వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు. ఐసీటీసీ, ఏఆర్టీ, డీఎస్ఆర్‌సీ, కేర్ అండ్ సపోర్ట్, బ్లడ్ బ్యాంక్, లింక్ వర్కర్ స్కీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమలాపురం అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు మంజూరు

## ఇందుపల్లి ముంపు నివారణకు రూ.8 కోట్లతో ఆక్విడక్ట్ నిర్మాణం



**అమలాపురం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. శనివారం అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 19 వినతిపత్రాలను స్వీకరించారు. వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ సాధారణంగా ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్‌ను ఈ వారం విజయవాడ పర్యటన కారణంగా శనివారం నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి, నిధుల సమీకరణ కోసం విజయవాడ వెళ్లి పలువురు మంత్రులను కలిసినట్లు చెప్పారు. అమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయించుకుని వచ్చినట్లు తెలిపారు. ఇందుపల్లి గ్రామం తరచూ వరద ముంపునకు గురవుతున్న విషయాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆనందరావు తెలిపారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నూతన ఆక్విడక్ట్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించి రూ.8 కోట్లు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకురావడంతో పాటు ఇందుపల్లి ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్న ఎమ్మెల్యే ఆనందరావుకు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# రామచంద్రాపురంలో విజయవంతంగా ముగిసిన ఐదు రోజుల ఎంట్రప్రెన్యూర్‌షిప్ బూట్ క్యాంప్

**రామచంద్రపురం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22 నుంచి 26 వరకు ఐదు రోజుల పాటు నిర్వహించిన ఆర్టీఐహెచ్ రాజమండ్రి హబ్ బూట్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో యాభై మంది విద్యార్థులు పాల్గొని నూతన వ్యాపార ఆలోచనలు, ఆవిష్కరణలు, సమస్యల పరిష్కారం, మరియు సమష్టి కృతలపై ప్రాయోగికంగా అవగాహన సంపాదించారు. కళాశాల ప్రిన్సిపాల్ చిట్టాబాబు నేతృత్వంలో జరిగిన ఈ శిక్షణలో రాజమండ్రి హబ్ ప్రతినిధులు శ్రీనివాస్ ఇన్క్యుబేషన్ అసోసియేట్ గా మరియు శ్రీధర్ నాయుడు మెంటార్ గా వ్యవహరించి విద్యార్థులకు తగిన మార్గదర్శకత్వం అందించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ షహజాది బేగం, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు సత్య దుర్గా రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని సహకారం అందించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసేవారుగా కాకుండా, భవిష్యత్తులో ఇతరులకు



ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తల స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

### రూ.14 లక్షలతో శ్రీ కోదండ రామాలయం ప్రహరీ గోడ నిర్మాణానికి

# శంకుస్థాపన చేసిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్

## సత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపిన చిట్టూరి వారిపాలెం గ్రామ ప్రజలు



**కె.గంగవరం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం, గంగవరం మండలం, చిట్టూరివారిపాలెం గ్రామంలో శనివారం రూ. 14 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న శ్రీ కోదండ రామాలయం ప్రహరీ గోడ నిర్మాణ పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం శంకుస్థాపన చేశారు. ప్రజాసేవయే పరమావధిగా నడుస్తున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆర్థిక సౌజన్యంతో ఈ ప్రహరీ గోడ నిర్మాణాన్ని చేపట్టడం విశేషం. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించేందుకు మరియు మందిర రక్షణ కొరకు ఈ నిర్మాణాన్ని ఫౌండేషన్ ద్వారా పూర్తి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు మరియు భక్తులు స్పందిస్తూ.. నియోజకవర్గంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అందిస్తున్న సామాజిక, ఆధ్యాత్మిక సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఆలయ అభివృద్ధికి ఫౌండేషన్ తరఫున ఇంతటి పెద్ద మొత్తాన్ని కేటాయించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ వాసంశెట్టి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో బేతవోలు సుబ్రహ్మణ్యం, సలాది రమేష్, జుత్తుకు శ్యాంప్రసాద్, పిల్లి రాంబాబు, కుక్కల సత్తిబాబు, దంగేటి కృష్ణమూర్తి, చీకట్ల రామకృష్ణ, కుక్కల శ్రీనివాసు కొప్పిశెట్టి సతీష్, గ్రామ పెద్దలు చిట్టూరి సుబ్రహ్మణ్యం, గెద్దాడ శ్రీరాములు, చిత్తూరు కొండ, చిట్టూరిచిట్టూరి సత్యనారాయణ, శేషగిరి, ఒళ్ళు ఆంజనేయులు గెద్దాడ రామకృష్ణ, శీలం అన్నవరం, దంగేటి గౌరీ శంకర్, గుబ్బల వెంకటరమణ, పలువురు కూటమి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 'చలో విజయవాడ' కార్యక్రమానికి అనుమతి లేదు

### ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారుల ఆదేశాలు ఉల్లంఘిస్తే నిబంధనల మేరకు చర్యలు
### జిల్లా ఎస్పి రాహుల్ మీనా




**అమలాపురం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యం లో ఈ నెల 27న నిర్వహించనున్న 'చలో విజయవాడ' కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు లేవని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించేందుకు సమీకరణకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసు శాఖ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయడం, పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల బకాయిలను విడుదల చేయడం, స్పష్టమైన పదోన్నతి మార్గాన్ని ఏర్పాటు చేయడం, జి.ఓ. నంబర్ 11ను రద్దు చేయడం తదితర సర్వీస్ సంబంధిత డిమాండ్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు, వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు ఉద్యోగులకు ఇప్పటికే తగిన ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారుల ఆదేశాలను ఉల్లంఘించి అనుమతి లేని కార్యక్రమానికి వెళ్లే ఉద్యోగులపై నిబంధనల మేరకు శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ, అనుమతి లేని 'చలో విజయవాడ' కార్యక్రమానికి వెళ్లకుండా సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

### వన్నె చింతలపూడి అంబేద్కర్ నగర్‌లో

# ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవాలు




**అమలాపురం, సెప్టెంబర్ 27, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి అంబేద్కర్ నగర్ (ముంగడవారి పేట), కొత్తగరువు, ఉప్పుచెరువు, రంగాపురం మెయిన్ సెంటర్‌లలో అంగన్వాడీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎస్.కె. ఉనిషా మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతారని అన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని, మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలు రకాల ఆకుకూరలు, కాయగూరలు, పండ్లతో కూడిన పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, లబ్ధిదారులు వాటి ప్రయోజనాలను అనుభవం ద్వారా సమాజానికి తెలియజేయాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమని ఉనిషా తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు పి. అమూల్య, పార్వతి, మణికుమారి, అంగన్వాడీ సిబ్బంది నాగదేవితో పాటు బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పలువురు పాల్గొన్నారు.

# గరుడ పథకం పునఃప్రారంభం

### కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెళ్ల నారాయణమూర్తి




**అమలాపురం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** పేద బ్రాహ్మణుల మరణానంతరం అంత్యక్రియలు నిర్వహించేందుకు బ్రాహ్మణ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన గరుడ పథకాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. 2014 నుంచి 2019 వరకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకం ద్వారా దహన సంస్కారాల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించేది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసింది. దీంతో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, డైరెక్టర్లు ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రత్యేక చొరవతో గరుడ పథకాన్ని తిరిగి ప్రారంభించడం పట్ల బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెళ్ల నారాయణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. పేద బ్రాహ్మణ కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# కె.గంగవరం కాంప్లెక్స్‌లో ప్రయోగపూర్వక బోధనకు ప్రశంసలు



**కె.గంగవరం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు, ప్రాథమిక స్థాయి నుంచే ప్రయోగపూర్వకంగా విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం అన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, కె. గంగవరంలో నిర్వహించిన కాంప్లెక్స్ కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రయోగపూర్వక బోధనను పరిశీలించారు. ముఖ్యంగా విద్యార్థుల అవగాహనను పెంపొందించే విధంగా రూపొందించిన డ్యామ్ వర్కింగ్ మోడల్‌ను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. పాఠ్యాంశాలను ప్రయోగాలు, నమూనాలు మరియు ప్రాయోగిక కార్యకలాపాలతో అనుసంధానం చేస్తూ బోధిస్తున్న జిల్లా ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎన్. శ్రీనివాసరావును జిల్లా సైన్స్ అధికారి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఇ.వో-1 అలజంగి నాగరాజు, ఐఆర్‌కోఆర్డినేటర్ సత్యనారాయణ కాంప్లెక్స్‌ను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు అందించారు. కె.ఆర్.కె. ప్రసాద్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కె. గంగవరం కాంప్లెక్స్ పరిధిలోని విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే ప్రయోగపూర్వకంగా, ఆసక్తికరంగా విద్యను అందించేలా చేపట్టిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తి, పరిశీలనా దృక్పథం, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ రూరల్‌లో తెలుగుదేశం పార్టీకి కొత్త జోష్

## తెలుగు యువత.. బీసీ సెల్‌కు నూతన కార్యవర్గాలు - అధ్యక్షులుగా పిల్లి రాధాకృష్ణ, కొమిరిశెట్టి నర్సింగరావు



పిల్లి రాధాకృష్ణ,
నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు



నరసింగరావు,
నియోజకవర్గబీసీ సెల్ అధ్యక్షులు

**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సూచనలు, ఆశయాలకు అనుగుణంగా కాకినాడ రూరల్ నియోజకవర్గ తెలుగు యువత, బీసీ సెల్ నూతన కమిటీని ప్రకటించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణమూర్తి ఈ కమిటీలని ప్రకటించారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడిగా పిల్లి రాధాకృష్ణను, బీసీ సెల్ అధ్యక్షుడిగా కొమిరిశెట్టి నర్సింగరావును నియమించారు. తెలుగు యువత ఉపాధ్యక్షులుగా జంపన క్రాంతి సందీప్, గుమ్మెల్ల వీరబాబు, పసల వెంకట్, ప్రధాన కార్యదర్శిగా ఎలగా లోవరాజును నియమించారు. కార్యనిర్వహక కార్యదర్శులుగా కొల్లుబోయిన అచ్యుత్ సాయి, పెద్దపూడి వీర వెంకట సత్యనారాయణ, కొప్పిశెట్టి వెంకటేష్, కాదా నాని బాబు, పలివెల దుర్గారావు, కార్యదర్శులుగా వనమాడి ఎల్లాజీ, కొప్పిశెట్టి భార్గవ్ రాముడు, పిల్లి రవి కిరణ్, బొంతు వీర వెంకట దుర్గాప్రసాద్, మట్ట సాయిరాంలను ఎంపిక చేశారు. అధికార ప్రతినిధులుగా వనుము ఉపేంద్రనాథ్, పూసపాటి రంజిత్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పెంకె శ్రీనివాస్‌ను నియమించారు. అదేవిధంగా బీసీ సెల్ ఉపాధ్యక్షులుగా గుత్తుల రామలింగేశ్వరరావు, పితాని అప్పన్న, కాండ్రేగుల వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పలివెల జానకి రామయ్యను నియమించారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా నరుకుర్తి ప్రసాద్ రావు, గేదెల దశరథరావు, పితాని జయరామకృష్ణ, గురీ గణేష్ కుమార్, మట్ట రాములను ఎంపిక చేశారు. కార్యదర్శులుగా నీలం రాంబాబు, గీశాల శ్రీనివాసరావు, గుబ్బల భాస్కరరావు, పాలిక సూర్యనారాయణ, పెంకె ఏడుకొండలును నియమించారు. అధికార ప్రతినిధులుగా పంపన బుజ్జి, చెల్లిబోయిన సూర్య ప్రకాశంలను, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కొల్లుబోయిన వీరబాబును నియమించారు. పార్టీ అధిష్టానం సూచనలు, ఆశయాలకు అనుగుణంగా నూతన కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమన్వయంతో పనిచేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణమూర్తి ఆకాంక్షించారు.

# స్వర్గీయ పెద్దింటికి పిఎంపీలు ఘనంగా నివాళులు



**కోరుకొండ, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ రామకృష్ణ ఆసుపత్రి వైద్యాధినేత స్వర్గీయ డాక్టర్ పెద్దింటి అరుణ ప్రసాద్ స్వర్గస్తులైన విషయం పాఠకులకు విధితమే. శనివారం స్వర్గీయ అరుణ్ ప్రసాద్ వైకుంఠ సమారాధన కార్యక్రమాన్ని శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మైదానంలో పలువురు ప్రముఖ వైద్యులు, కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు, పీఎంపీలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిష్యులు, పలువురు పీఎంపీ వైద్య మిత్రులు అరుణ్ ప్రసాద్ వైకుంఠ సమారాధనలో పాల్గొని స్వర్గీయ అరుణ్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, బంధువులు,శ్రేయోభిలాషులు, పీఎంపీ వైద్య మిత్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తొలిసారి రాజమహేంద్రవరంలో

# ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

- రాష్ట్రవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల నిర్వహణ
- ఏఐ టెక్నాలజీతో ఏపీ టూరిజంలో కొత్త శకం.. 2027 గోదావరి పుష్కరాలే లక్ష్యంగా 'ది గోదావరి కాల్స్' ప్రచారం
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, క్రియేటర్లతో.. ఏపీ టూరిజంపై ప్రత్యేక ప్రచారం
- కేరళ కోవాళం తరహాలో ఏపీ తీరంలో వెల్ నెస్ సెంటర్లు - ఆయుర్వేదం, యోగాలకు పెద్దపీట
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదాతో ఊతం
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల చొరవతో ఏపీలో క్యూ కడుతున్న ఇన్వెస్టర్లు
- వారి నాయత్వంలో మారుతున్న ఏపీ పర్యాటక రూపురేఖలు
- కేంద్రంతో సత్సంబంధాలు, భారీ ప్రాజెక్టుల సాధన
- తిరుపతి, విశాఖలను గ్లోబల్ టూరిజం హబ్‌లుగా మారుస్తున్నామన్న మంత్రి దుర్గేష్



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** తొలిసారిగా రాజమహేంద్రవరం వేదికగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని హుకుంపేట కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమా వేశంలో మంత్రి కందుల దుర్గేష్ అంతర్జాతీయ పర్యాటక దినోత్సవ వేడుకల వివరాలను వెల్లడించారు. కేవలం రాజమండ్రిలోనే కాకుండా రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఈ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంజీరా హోటల్ వేదికగా జరగనున్న ఈ అంతర్జాతీయ పర్యాటక దినోత్సవ వేడుకలకు జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల దిశానిర్దేశంలో పర్యాటక రంగానికి సంబంధించి కొత్త కార్యాచరణతో 'రాజమండ్రి డిక్లరేషన్'ను ప్రకటి స్తున్నట్లు తెలిపారు.

**సాంకేతికతతో పర్యాటకాభివృద్ధి - ఏఐ టెక్నాలజీ జోడంపు**

ఇప్పటివరకు సాంప్రదాయ పద్ధతుల్లో సాగిన పర్యాట కాభివృద్ధిని, ఇకపై పూర్తిగా సాంకేతిక ఆధారితంగా మారు స్తున్నట్లు మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

**ఎక్స్ ప్లర్జర్ సంస్థతో ఒప్పందం:**

రాష్ట్రంలోని 130 పర్యాటక ప్రాంతాల్లో 130 భాషల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) టెక్నాలజీ ద్వారా ఆయా ప్రాంతాల సమాచారాన్ని, ప్రాశస్త్యాన్ని పర్యాటకులకు అందు బాటులోకి తెస్తున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు.

**ఇన్ఫ్లూయెన్సర్లు, క్రియేటర్ల ద్వారా ప్రచారం:**

పర్యాటక ప్రాంతాలకు వచ్చే యాత్రికులు ఒకటి రెండు రోజులతో సరిపెట్టకుండా, మూడు నాలుగు రోజులు అక్కడే ఉండేలా ఆకర్షించేందుకు క్రియేటర్లతో, ఇన్ఫ్లూయెన్సర్లతో ప్రత్యేక డాక్యుమెంటరీలు చేయించి ప్రదర్శించనున్నామన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి దుర్గేష్ పర్యాటకశాఖాధికారులతో కలిసి రాజమహేంద్రవరం నుండి హాఫ్ ఆన్ హాఫ్ ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులను అధికారికంగా జెండా ఊపి ప్రారంభించారు. ఆ బస్సుల్లో ఇన్ఫ్లూయెన్సర్లు రాజమహేం ద్రవరం సమీపంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శించి మంచి రీల్స్ తయారు చేసి విశ్వవ్యాప్తం చేస్తారని తెలిపారు. పర్యాటక ప్రాంతాల ప్రచారంలో సోషల్ ఇన్ ఫ్లూయెన్సర్ల పాత్ర కీలకం అన్నారు. ఈ ప్రాంతంలో జరిగే పర్యాటకాభివృద్ధి ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. అంతేగాక గోదావరి మాతకు ఇచ్చే హారతిని తిలకించాలన్నారు.

**క్రూజ్, కారవాన్ టూరిజం:**

సముద్రంలో కార్డెలియా క్రూజ్ ను విశాఖ-చెన్నై-పాండిచ్చేరి మధ్య ఇప్పటికే ప్రారంభించామన్నారు. అలాగే కాకినాడ తీరం నుండి హోప్ ఐల్యాండ్, కోరింగ, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో మరో రివర్ క్రూజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కారవాన్ టూరిజం, హోమ్ స్టేలు, టెంట్ సిటీలతో వినూత్నంగా ముందుకు వెళ్తున్నామన్నారు.

**రూ.430 కోట్లతో కేంద్ర ప్రభుత్వ సహకార ప్రాజెక్టులు**

కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రానికి 8 పర్యాటక ప్రాజెక్టులకు రూ.428 కోట్ల నిధులు మంజూరయ్యాయని అన్నారు. వాటిలో స్వదేశీ దర్శన్ 2.0 క్రింద సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ. 97.52 కోట్లు,బొర్రా గుహలకు రూ. 29.87 కోట్లు,సాస్కి క్రింద అఖండ గోదావరి పునరుద్ధరణకు రూ. 94.44 కోట్లు, గండికోట అభివృద్ధికి రూ. 77.91 కోట్లు, ప్రసాద్ స్కీమ్ కింద అన్నవరం దేవస్థానానికి రూ. 25.32 కోట్లు, సింహాచలంకు రూ. 54.04 కోట్లు, అదే విధంగా సీబీడీడీ క్రింద అహోబిలం స్పిరిచువల్ ఒడిస్సీకి రూ. 24.96 కోట్లు, నాగార్జున సాగర్ బౌద్ధ సర్క్యూట్‌కు రూ. 25 కోట్లు మంజూరు అయ్యాయని, యుద్ధప్రాతిపదికన పర్యాటక అభివృద్ధి చేస్తున్నామన్నారు.బొర్రా గుహల్లో లైట్ అండ్ సౌండ్ షోలు, పర్యాటక ప్రాంతాల్లో 3, 5, 7 స్టార్ హోటళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు.ఇవే గాక ప్రసాద్ స్కీం క్రింద అరసవిల్లి దేవాలయాన్ని కేంద్ర సహకారంతో మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు ప్రారంభించామన్నారు. తిరుపతి, విశాఖపట్నంను అంతర్జాతీయ స్థాయి ప్రధాన పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దడానికి కేంద్రం అంగీకరించిందని స్పష్టం చేశారు.కేరళ కోవాళం బీచ్ తరహాలో ఏపీలోని సుదీర్ఘ సముద్ర తీరంలో వెల్ నెస్ సెంటర్ల (ఆయుర్వేదం, యోగా) ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

**రుషికొండ ప్యాలెస్ వినియోగంపై త్వరలోనే తుది నిర్ణయం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల ఆమోదంతో రుషికొండ ప్యాలెస్ వినియోగంపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఆధారంగా, సీఆర్‌జెడ్ (జ=్గ) నిబంధనలకు లోబడి విశాఖలో గ్రామసభ నిర్వహించిన అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందన్నారు. తాజ్ గ్రూప్, లీలా హోటల్ గ్రూప్, అట్మాస్ఫియర్ కోర్ వంటి ప్రతిష్టాత్మక గ్రూప్ హోటల్స్ ముందుకు వచ్చాయని, పెట్టుబడిదారుల ఆసక్తి మేరకు తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. గత పాలకులు రుషికొండ ప్యాలెస్‌ను ఇష్టారీతిన నిర్మించారని, వ్యక్తిగత వినియోగం కోసం అత్యంత విలాసవంతంగా నిర్మించారని విమర్శించారు. వీలైనంత త్వరగా రుషికొండ ప్యాలెస్‌లు వినియోగానికి తెస్తామని స్పష్టం చేశారు.. రుషికొండ ప్యాలెస్ ను ఆతిథ్యరంగానికి వినియోగించేలా చర్యలు చేపడతామన్నారు. గతంలో రుషికొండ రిసార్టు ద్వారా ఏటా రూ.15 కోట్లు ఆదాయం వచ్చేదని, గత ప్రభుత్వ నిర్వాకం వల్ల పర్యాటకశాఖ ఆదాయం కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు..రుషికొండపై ఉన్న 9 ఎకరాల్లో 7.5 ఎకరాలు సీఆర్‌జెడ్‌లో ఉండగా, కేవలం 1.5 ఎకరాల్లోనే నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉందని స్పష్టం చేశారు..

**2027 గోదావరి పుష్కరాల ఘన నిర్వహణ**

2027లో జరగబోయే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, అద్భుతంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.పుష్కరాలకు కర్టెన్ రైజర్‌గా అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'ది గోదావరి కాల్స్' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాళ్లబండి సుబ్బారావు, రాజరాజనరేంద్రుడు, ఆదికవి నన్నయ్య తదితరుల స్మరణతో తెలుగు కళా వైవిధ్యాన్ని ప్రదర్శించబోతున్నట్లు చెప్పారు. బ్రిడ్జిలంకలో టెంట్ సిటీలు, వాటర్ ఫ్రంట్ గేమ్స్, మరియు పోలవరం ప్రాజెక్టు సమీపంలోని గిరిజన ప్రాంతాల్లో ఎకో టూరిజంను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**త్వరలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక రోడ్ షోలు..**

సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం వల్ల ఇన్వెస్టర్లు ముందుకు వస్తున్నారని, ల్యాండ్ అలాట్ మెంట్ పాలసీ ద్వారా పారదర్శకంగా భూములు కేటాయిస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. త్వరలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక రోడ్ షోలు నిర్వహించి పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు.రాజమహేంద్రవరం సమీపంలోని పిచ్చుకలంకలో ఒబెరాయ్ హోటల్ ఏర్పాటు చేసేందుకు సుముఖంగా ఉందని తెలిపారు. అలాగే అనపర్తికి చెందిన వ్యక్తి ఫిల్మ్ స్టూడియో, స్టార్ హోటల్, రిసార్ట్ ఏర్పాటుకు ముందుకు రాగా.. చైతన్యరాజు, గండి భాస్కర్ రావు సొంత స్థలంలో రిసార్ట్ ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు.

**ఎకో టూరిజం ఎంఓయూల**

ఎకో టూరిజంను మరింత అభివృద్ధి చేసే దిశగా వివిధ శాఖలతో ప్రత్యేకంగా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన ఇండియన్ టూర్ ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యక్రమం వల్ల దేశవ్యాప్తంగా పలువురు ఇన్వెస్టర్లు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని, కొత్తగా ఎంఓయూలు కూడా చేసుకుంటున్నామని పేర్కొన్నారు..

**కళారంగానికి పునరుజ్జీవం - నంది అవార్డుల ప్రదానోత్సవం**

నిరాదరణకు గురైన కళారంగానికి కూటమి ప్రభుత్వం పూర్వవైభవం తెస్తోందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. డిసెంబర్‌లో విజయవాడ లేదా అమరావతిలో నంది ఫిల్మ్ అవార్డులు, తిరుపతిలో నంది టీవీ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.జనవరిలో తెనాలిలో నంది నాటకోత్సవాలను వైభవంగా నిర్వహించడంతో పాటు నాటకరంగ కళాకారులకు కందుకూరి పురస్కారాలు అందిస్తామన్నారు.ఇప్పటికే చాలామంది కవులు, కళాకారులను ఉగాది పురస్కారాలతో పాటు బోయి భీమన్న, గుర్రం జాషువా, గిడుగు రామమూర్తి పంతులు వంటి మహానుభావుల పేరిట అవార్డులు అందజేసి సత్కరించమన్నారు.

**కూటమి ధర్మం పాటిస్తూనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ**

కూటమి ధర్మాన్ని పాటిస్తూనే అక్టోబర్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. ఇప్పటికే పార్టీలకు విడిగా, కూటమికి విడిగా సమన్వయ కమిటీలు ఏర్పాటయ్యాయని, తరుచూ ఆ భేటీల్లో పాల్గొని బలబలాలు చర్చిస్తున్నామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

**వివాదాలపై స్పష్టత:**

ఉండ్రాజవరంలో వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుపై స్పందిస్తూ, అందరికీ ఆమోదయోగ్యమైన మెరుగైన స్థలాన్ని గుర్తించామని, ఇందులో ఎలాంటి వివాదం లేదని తేల్చిచెప్పారు.ఈ సందర్భంగా రెండున్నరేళ్ల క్రితం నాటి ఏపీ పర్యాటక రంగానికి, ప్రస్తుత స్థితికి మధ్య ఉన్న స్పష్టమైన మార్పును గమనించాలని మంత్రి దుర్గేష్ ప్రజలను, మీడియాను కోరారు.

### వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లుపై

# వివిధ వర్గాలతో ఎంపీ పురందేశ్వరి చర్చలు

## కలకత్తా కాళికాదేవిని దర్శించుకున్న ఎంపీ




**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** కోల్‌కతాలో అధ్య యన పర్యటనలో భాగంగా వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు, 2025పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ చైర్‌పర్సన్‌గా రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వివిధ వర్గాలతో కీలకమైన చర్చలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్, అరుణాచల్ ప్రదేశ్, జార్ఖండ్, సిక్కిం రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో పాటు ఐఐఎం,ఐఐటి కోల్‌కతా, ఖరగ్‌పూర్, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో సమావేశమై బిల్లుకు సంబంధించిన అంశాలపై వారి అభిప్రాయాలను కమిటీ తీసుకుంది.విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ, నాణ్యమైన ఉన్నత విద్యను అందరికీ కల్పించే దిశగా వివిధ వర్గాల సూచనలు ఎంతో విలువైనవని, ఈ అధ్యయన పర్యటన ద్వారా అందిన అభిప్రాయాలు, సూచనలను కమిటీ పరిశీలనలోకి తీసుకుంటుందని పురందేశ్వరి తెలిపారు..కోల్‌కతాలోని కాళీఘాట్‌లో ఉన్న అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన కాళికా దేవి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈఆలయాన్ని సందర్శించి, అమ్మవారి దర్శన భాగ్యం పొందడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని,.ఆ జగజ్జనని కాళికా మాత అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆమె కోరుకున్నారు.

# దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు పంపిణీ

## 8 మంది లబ్ధిదారులకు ఉచిత స్కూటీలు అందజేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 26, విశ్వం వాయిస్ న్యూస్ :** బొమ్మూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులైన దివ్యాంగులకు ఉచిత త్రిచక్ర వాహనాలను (మోటరైజ్డ్ స్కూటీలను) రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజా నగరం నియోజకవర్గానికి చెందిన కానవరం గ్రామానికి చెందిన చాపల ధనలక్ష్మి, రఘు నాథపురం గ్రామానికి చెందిన మడికి జ్యోతి, సూర్యారావుపేట గ్రామానికి చెందిన దొండపాటి సుశీల, తూర్పుగోనగూడెం గ్రామానికి చెందిన తోట లలిత, లాలాచెరువు హోసింగ్ బోర్డు కాలనీకి చెందిన బొర్రా రామలింగేశ్వర్, కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామా నికి చెందిన చీకట్ల శ్రీనివాస్, సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన కర్రి వీర్రాజు, దొడ్డి నాగలక్ష్మికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్వయంగా త్రిచక్ర వాహనాల (స్కూటీల) తాళాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా తమ కాళ్ళపై తాము నిలబడేందుకు, వారి నిత్య జీవితంలో ఆర్థిక, సామాజిక పురోగతి సాధించేందుకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రతిజ్ఞాబద్ధంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్క దివ్యాంగుడికి ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.వాహనాలు అందుకున్న దివ్యాంగులు ఎమ్మెల్యేకి, ప్రభుత్వానికి తమ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రతినిధులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# విలేఖరి రాత సమాజానికి వెలుగు

**సూర్యుడు తన శక్తితో లోకాన్ని వెలిగిస్తే.. జర్నలిస్టు తన రచనలతో సమాజాన్ని మేలుకొలుపుతాడు**

**ఘనంగా 'విశ్వం వాయిస్' తెలుగు దినపత్రిక పదో వార్షికోత్సవ వేడుకలు**





**రాయవరం, సెప్టెంబర్ 27, విశ్వం వాయిస్ న్యూస్ :** సూర్యుడు తన శక్తితో లోకానికి వెలుగునందిస్తూ చీకటిని పారద్రోలినట్లే.. విలేఖరి తన కలంతో, తన రచనలతో సమాజంలోని చీకటి కోణాలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజలను మేలుకొలుపుతాడని ఆధ్యాత్మికవేత్త విజయ ప్రసాద్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రాయవరంలో విశ్వం వాయిస్ తెలుగు దినపత్రిక పదో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవాంగ కమ్యూనిటీ ఫంక్షన్ హాల్‌లో విశ్వం వాయిస్ తెలుగు దినపత్రిక సబ్ ఎడిటర్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆధ్యాత్మికవేత్త విజయ ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విశ్వం వాయిస్ యాజమాన్యానికి, సిబ్బందికి, విలేకరులకు పదో వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తొలుత అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రాయవరంలోని విశ్వం వాయిస్ తెలుగు దినపత్రిక కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వహణ, పత్రిక కార్యకలాపాలను పరిశీలించి యాజమాన్యానికి, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త విజయ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో విలేఖరి వృత్తికి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజల ముందుకు తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వ్యవస్థలో ఎక్కడైనా లోపాలు, తప్పిదాలు చోటుచేసుకున్నప్పుడు వాటిని వెలుగులోకి తీసుకువచ్చి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి మార్గం చూపగలిగే శక్తి జర్నలిస్టుల కలానికి ఉందన్నారు. "జర్నలిస్టు సూర్యుని లాంటివాడు. సూర్యుడు తన వెలుగుతో ప్రపంచాన్ని మేలుకొలిపితే.. జర్నలిస్టు తన రచనలతో సమాజాన్ని మేలుకొలుపుతాడని ఆయన పేర్కొన్నారు. ఒక వార్త అనేది కేవలం అక్షరాల సమాహారం కాదని, దాని వెనుక ప్రజా సమస్య, ఒక కుటుంబం ఆవేదన, ఒక ప్రాంతం అభివృద్ధి, ఒక వ్యవస్థలోని లోపం దాగి ఉంటుందని వివరించారు. అందువల్ల జర్నలిస్టులు వాస్తవాలను నిర్ధారించుకుని బాధ్యతాయుతంగా వార్తలను ప్రచురించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ జర్నలిజం వృత్తిలో అనేక సవాళ్లు ఉన్నప్పటికీ సమాజం కోసం పనిచేస్తున్న విలేకరుల సేవలు అభినందనీయమన్నారు. గ్రామీణ స్థాయి విలేఖరిగా ప్రస్థానం ప్రారంభించి సంస్థను 10 సంవత్సరాలు నడిపించడం కష్టతరమైన బాధ్యతని, సమర్థవంతంగా నడిపిస్తున్న విశ్వం వాయిస్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ కష్టపడిన తీరు అభినందనీయమన్నారు. బయటకు కనిపించే తెల్లచొక్కా వెనుక అనేక ఆవేదనలు, ఒత్తిళ్లు, సమస్యలు ఉంటాయని, అయినప్పటికీ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలనే ఆసక్తితో జర్నలిస్టులు తమ వృత్తిలో కొనసాగుతున్నారని అన్నారు. వార్తా కథనాల్లో ఆధారాలతో కూడిన వాస్తవాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ఆధారాలు లేని ఆరోపణలు, ఊహాగానాల ఆధారంగా వ్యక్తులను నిందించడం లేదా బాధించడం సమంజసం కాదన్నారు. జర్నలిస్టులు తమ వృత్తి గౌరవాన్ని కాపాడుకుంటూ వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు. తన వ్యక్తిగత అనుభవాలను కూడా ఈ సందర్భంగా ఆయన వివరించారు.



### ఆపదలో ఉన్న కుటుంబానికి రూ.2 లక్షల చేయూత

విశ్వం వాయిస్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ భర్తను కోల్పోయి ముగ్గురు పిల్లలతో గృహ వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అంగర సుమిత్ర అనే మహిళ కుటుంబానికి లలిత అసోసియేషన్ తరఫున యువ పారిశ్రామికవేత్త సత్తి వర ప్రసాద రెడ్డి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవాలనే సేవా భావం ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు. ఆర్థికంగా స్థితిమంతులైన వారు సైతం పెద్ద మొత్తంలో సహాయం చేసేందుకు వెనుకాడుతున్న పరిస్థితుల్లో, నిరుపేద కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన లలిత అసోసియేషన్ నిర్వాహకులు ప్రసాద్ రెడ్డి సేవా దృక్పథాన్ని అభినందించారు. సమాజంలో సేవా కార్యక్రమాలకు మరింత మంది ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సహాయం పొందిన సుమిత్ర భావోద్వేగం చెందిన సుమిత్ర అండగా నిలిచిన మంత్రి సుభాష్ తదితర సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు

### 60 మంది విలేకరులకు హెల్మెట్ల పంపిణీ

జర్నలిస్టుల భద్రతను దృష్టిలో పెట్టుకుని లలిత అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయవరం మండలంతో పాటు విశ్వం వాయిస్ సంస్థలో పనిచేస్తున్న సుమారు 60 మంది విలేకరులకు ఖరీదైన హెల్మెట్లను పంపిణీ చేశారు. వార్తల సేకరణ కోసం విలేకరులు నిరంతరం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాల్సి వస్తుందని, ఈ క్రమంలో రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని కార్యక్రమంలో సూచించారు. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని వాహనం నడిపేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని, వార్తా సేకరణ సమయంలో కూడా వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులకు హెల్మెట్లను అందించడం ద్వారా వారి వృత్తిపరమైన అవసరంతో పాటు కుటుంబ భద్రతను కూడా దృష్టిలో పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### పదేళ్ల ప్రస్థానం.. ప్రజా సమస్యలే లక్ష్యంగా

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రిక పదేళ్ల ప్రస్థానంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందని సభలో పలువురు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా ప్రతినిధుల కార్యకలాపాలు, అధికార యంత్రాంగం పనితీరు తదితర అంశాలను ప్రజలకు చేరవేయడంలో ప్రాంతీయ పత్రికల పాత్ర కీలకమని తెలిపారు. ప్రజల గొంతుకగా నిలిచి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కారానికి మార్గం సుగమం చేయడం జర్నలిజం యొక్క ప్రధాన బాధ్యతల్లో ఒకటని వక్తలు పేర్కొన్నారు. అదే సమయంలో వార్తా రచనలో నిష్పక్షపాత ధోరణి, వాస్తవ నిర్ధారణ, సామాజిక బాధ్యత అత్యంత ముఖ్యమని సూచించారు. అనంతరం అతిథులు, ప్రముఖులు, జర్నలిస్టులు, లలిత అసోసియేషన్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమం అనంతరం అతిథులు, జర్నలిస్టులు, ఆహ్వానితులకు ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పసలపూడికి చెందిన నీటి సంఘం అధ్యక్షులు వెలగల సత్యనారాయణరెడ్డి, రాయవరం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవల్లి రాంబాబు, వెదురుపాక మాజీ సర్పంచ్ పెద్దబ్బాయి, రాయవరం మాజీ సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, తాడి శ్రీనివాసరెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వీర రాఘవరెడ్డి, రాజామణి, లలిత అసోసియేషన్ సభ్యులు, విశ్వం వాయిస్ ప్రతినిధులు, విలేకరులు, తదితరులు పాల్గొన్నారు.

ముంపు పొలాలను

## సందర్శించిన రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బంది



**కోరుకొండ, సెప్టెంబర్ 27, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల తుఫాన్ కారణంగా ముంపుకు గురైన గ్రామాలలో రెవెన్యూ వ్యవసాయశాఖ సిబ్బంది ముంపు పొలాలను సందర్శించి రైతులకు తగు సూచనలు చేశారు. శనివారం సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తాసిల్దార్ సునీత,డాట్ శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్, వ్యవసాయశాఖ సిబ్బంది స్థానిక ప్రతినిధులతో ముంపుకు గురైన పొలాలను సందర్శించి,రైతులు ముంపు గురైన పొలాల్లో చేపట్టవలసిన చర్యలను తెలిపారు.కోరుకొండలో 2,347 ఎకరాలు ముంపుకు రెవెన్యూ,వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. పంపు పొలాల్లో నీరు పూర్తిగా తగ్గిన తర్వాత పంట నష్టం అంచనా వేసి నష్టపోయిన రైతులు జాబితాను తయారు చేస్తామన్నారు. పొలంలో నుండి నీరు తగ్గిన వెంటనే రైతులు టాప్ డ్రెస్సింగ్ కింద 20కేజీల యూరియా, 20కేజీల పొటాష్ చల్లుకోవాలని,దీంతో పాటు సిలింద్ర నాసిని మందులు అయినా ప్రోపికోనా జోల్ 2ఎంఎల్/లీ, హెక్సా కొనజల్ 2ఎమ్ / లీటర్ కి కలుపుకుని పిచికారి చేస్తే,తెగుళ్లను కూడా నివారించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సునీత, వ్యవసాయశాఖ సిబ్బంది శ్రీనివాసరావు, రామ తులసి,శాస్త్రవేత్తలు, రైతులు కంటే నాగ కేశవరావు, కంటే గణపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుండి పలు

## వినతులు స్వీకరించిన బొడ్డు

రానున్న ఎన్నికలపై నాయకులకు దిశ నిర్దేశం



**కోరుకొండ, సెప్టెంబర్ 27, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో గ్రీవెన్స్ ద్వారా ప్రజల నుండి పలు వినతులను తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి స్వీకరించారు. శనివారం బూరుగుపూడి గేటు వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు,కార్యకర్తలతో పలు విషయాలపై విస్తృతంగా చర్చించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులు, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, కార్యకర్తల సమన్వయం వంటి పలు సమస్యలను పలువురు బొడ్డు దృష్టి తీసుకెళ్లారు. అదేవిధంగా త్వరలో జరగనున్న ఎన్నికలపై దృష్టి సారించి, ఎన్డీఏ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బొడ్డు తెలిపారు.ప్రజల నుంచి అందుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బొడ్డు అన్నారు.ఈ కార్యక్రమంలో తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు,గంగిశెట్టి చంటిబాబు, నూని వెంకన్న, రొంగల శ్రీనివాస్, పుప్పాల వెంకటరత్నం, పీతా శ్రీనుబాబు, పెదపాటి భీమరాజు, కోర్పు రాజేష్, పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 28న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం



**సీతానగరం, సెప్టెంబర్ 27, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మరియు తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి ఆదేశాలతో 25వ తారీఖున జరగవలసిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ఆర్నాబ్ తుఫాన్ కారణంగా రద్దయింది.తిరిగి 28వ తారీఖున సోమవారం నిర్వహించబడుతుందని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా.వి.భవాని ప్రకటించారు. సీతానగరం మండలంలో ఉన్న అంగన్వాడి సెంటర్లు,ప్రభుత్వ మరియు ప్రైవేటు స్కూళ్ళు, కళాశాలలలో ఉన్న 1 సం. నుండి 19 సం లోపు 12,889 మంది పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయబడతాయని ఈ మా త్రలు తీసుకోవడం వల్ల కడుపులో ఉన్న నులిపురుగులు, బద్దె పురు గులు,కొంకి పురుగులు, సమూలం గా నిర్మూలించబడి పిల్లలు రక్త హీనత బారిన పడకుండా రక్షిం చబడతారని కావున పిల్లలందరూ తప్పకుండా మాత్రలు తీసుకోవాల ని తెలియజేశారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు | వాహనాల అమ్మకం | ట్యూషన్ & & విద్య | ఉద్యోగ అవకాశాలు | సర్వీసు& రిపేర్లు | ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

దుమ్మురేపుతున్న ప్యారడైజ్.. రెండో రోజే రూ.114 కోట్లకు పైగా..

# వీకెండ్‌లో మరిన్ని రికార్డులు..?



నాని నటించిన 'ది ప్యారడైజ్' బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. నాని కెరీర్ లో బిగెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన ఈ సినిమా రెండో రోజు కూడా అదే రేంజ్ లో కలెక్షన్స్ రాబడుతుంది. రెండు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.114 కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. ఓవర్సీస్‌లోనూ భారీ వసూళ్లతో దూకుడు కొనసాగిస్తోంది. నేచురల్ స్టార్ నాని నటించిన లేటెస్ట్ మూవీ ది ప్యారడైజ్ బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగిస్తోంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా.. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటూ కలెక్షన్ల పరంగా దూసుకెళ్తోంది. తాజాగా ఈ సినిమా కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.114 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు మేకర్స్ వెల్లడించారు. ఈమేరకు సోషల్ మీడియాలో ఓ పోస్టర్ ను విడుదల చేశారు మేకర్స్. నాని కెరీర్‌లో అత్యంత వేగంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకున్న చిత్రంగా 'ది ప్యారడైజ్' నిలిచినట్లు చిత్రబృందం పేర్కొంది. సినిమాకు వస్తున్న రెస్పాన్స్‌తో పాటు థియేటర్లలో ఆక్యుపెన్సీ కూడా ఆశాజనకంగా ఉండటంతో రానున్న రోజుల్లో కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో 'ది ప్యారడైజ్'కు మంచి ఆదరణ లభిస్తోంది. నాని మార్కెట్‌కు అనుగుణంగా ఇప్పటికే భారీ ఓపెనింగ్స్‌ను అందుకున్న ఈ చిత్రం రెండో రోజు కూడా కలెక్షన్లలో దూసుకుపోతున్నట్టు ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేసే యాక్షన్ ఎలిమెంట్స్ సినిమాకు ప్లస్‌గా మారినట్లు తెలుస్తోంది. ఇది కేవలం తెలుగు మార్కెట్‌కే పరిమితం కాకుండా తమిళనాడు, కర్ణాటకతో పాటు హిందీ మార్కెట్‌లోనూ ఈ సినిమాకు భారీ రెస్పాన్స్ వస్తుంది. నాని చిత్రాలకు ఉన్న మార్కెట్‌తో పాటు శ్రీకాంత్ ఓదెల గత చిత్రం తర్వాత ఏర్పడిన అంచనాలు కూడా ది ప్యారడైజ్ కు కలిసొస్తున్నాయి. ఇక ఓవర్సీస్ లోనూ ది ప్యారడైజ్ మంచి వసూళ్లను సాధిస్తోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో సినిమా దూకుడు కొనసాగుతోంది ఈ సినిమా. అక్కడ ఇప్పటికే 1.7 మిలియన్ డాలర్లకు పైగా గ్రాస్ సాధించినట్లు మేకర్స్ ప్రకటించారు. త్వరలోనే 2 మిలియన్ డాలర్ల మార్క్‌ను కూడా అందుకునే దిశగా సినిమా దూసుకుపోతుందని తెలుస్తోంది. రెండు రోజుల్లోనే రూ.114 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టిన ది ప్యారడైజ్ ప్రస్తుతం మూడో రోజులోకి అడుగుపెట్టింది. వీకెండ్ కావడంతో థియేటర్లలో బుకింగ్స్ మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో అడ్వాన్స్ బుకింగ్స్‌కు మంచి స్పందన కనిపిస్తుండటంతో ఈ వారాంతంలో సినిమా కలెక్షన్లు మరింత పెరుగుతాయనే అంచనాలు ఉన్నాయి.



కెరీర్ పీక్‌లో ఉండగానే ప్రమాదం..
ఎనిమిది నెలలపాటు మంచానికే పరిమితం..

# ఈ స్టార్ హీరోయిన్ లైఫ్‌లో ఇంత జరిగిందా.!!

తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవసరం లేని కథానాయికల్లో స్నేహ ఒకరు. సహజమైన అందం, చక్కటి అభినయం, కుటుంబ కథా చిత్రాల్లో ఒదిగిపోయే నటనతో ఆమె తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో మంచి పేరు సంపాదించారు. తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవసరం లేని కథానాయికల్లో స్నేహ ఒకరు. సహజమైన అందం, చక్కటి అభినయం, కుటుంబ కథా చిత్రాల్లో ఒదిగిపోయే నటనతో ఆమె తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో మంచి పేరు సంపాదించారు. స్నేహ అసలు పేరు సుహాసిని. తమిళ సినిమాలతో కెరీర్ ప్రారంభించిన ఆమె.. తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకున్నారు. గోపీచంద్ హీరోగా తెరకెక్కిన తొలివలపు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన స్నేహ.. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఆ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. హనుమాన్ జంక్షన్, వెంకీ, సంక్రాంతి, రాధాగోపాళం, శ్రీరామదాసు, మహారథి, మధుమాసం, ఏవండోయ్ శ్రీవారు, పాండురంగడు వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల్లో స్నేహకు ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడింది. అయితే స్నేహ కెరీర్‌లో జరిగిన ఓ సంఘటన ఆమెను కుంగదీసిందట. కెరీర్ మంచి స్థాయిలో కొనసాగుతున్న సమయంలో తాను ఓ ప్రమాదానికి గురైనట్లు స్నేహ తెలిపారు. ఆ ప్రమాదంలో చేతులు, కాళ్లు, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయని.. దాదాపు ఎనిమిది నెలల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందని తెలిపారు. కదలడానికి కూడా వీలు లేని పరిస్థితుల్లో ఆ రోజులు ఎంతో కష్టంగా గడిచాయని స్నేహ గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తన కెరీర్ ఇక ముగిసిపోయిందేమోనని ఎంతో బాధపడ్డానని, శారీరకంగా మాత్రమే కాకుండా మానసికంగానూ ఆ పరిస్థితి తనను ఎంతో ఇబ్బంది పెట్టిందని ఎమోషనల్ అయ్యారు స్నేహ. అలాంటి క్లిష్ట సమయంలో దర్శకుడు కరు పళనియప్పన్ తనకు అండగా నిలిచారని స్నేహ తెలిపారు. ఆయన తనను కలిసినప్పుడు తాను ఇంకా పూర్తిగా కోలుకోలేదని.. అయినప్పటికీ తనలో ధైర్యాన్ని నింపి, తిరిగి సినిమాల్లో నటించగలననే నమ్మకాన్ని కలిగించారని ఆమె వెల్లడించారు. ఆ తర్వాత ఆయన దర్శకత్వంలో వచ్చిన పార్తిబన్ కనవు తన కెరీర్‌లో కీలకమైన చిత్రంగా నిలిచిందని స్నేహ గుర్తుచేసుకున్నారు. ఆ సినిమా తనను మళ్లీ కెమెరా ముందుకు తీసుకొచ్చిందని చెప్పారు. జీవితంలో ఎదురైన ఆ కష్టమైన సమయంలో తనను మునుపటి కంటే మరింత బలమైన వ్యక్తిగా మార్చిందని ఆమె పేర్కొన్నారు. హీరోయిన్‌గా ఓ టైంలో టాప్‌లో నిలిచిన స్నేహ.. ఆ తర్వాత తన పాత్రలను మార్చుకున్నారు. కథలో కీలకమైన సహాయ పాత్రలు చేస్తూ కూడా ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. అల్లు అర్జున్ నటించిన 'సన్నాఫ్ సత్యమూర్తి', రామ్ చరణ్ నటించిన 'వినయ విధేయ రామ' వంటి సినిమాల్లో ముఖ్యమైన పాత్రల్లో కనిపించారు. ఆమధ్య విజయ్ నటించిన 'ది గోట్' చిత్రంలోనూ ఆయన భార్య పాత్రలో నటించి ఆకట్టుకున్నారు.

# ఇదే నా చివరి ప్రపంచకప్.. సర్వశక్తులూ ధారపోస్తా : కోహ్లీ

టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలక వ్యాఖ్యలు చేశాడు. వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచ కప్.. దేశం తరఫున తాను ఆడే చివరి మెగా టోర్నీ అని స్పష్టం చేశాడు. ఆ ట్రోఫీని కైవసం చేసుకునేందుకు మైదానంలో తన సర్వశక్తులూ ధారపోస్తానని తెలిపాడు. ఈ నెల 27 నుంచి వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌కు ముందు 'జియోస్టార్'తో కోహ్లీ మాట్లాడాడు. వచ్చే ఏడాది సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా వన్డే ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. "భారత్ తరఫున ఆడబోయే చివరి వరల్డ్‌కప్ ఇదే. టోర్నీని గెలవడమే నా ఏకైక లక్ష్యం. దాని కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు, మైదానంలో సర్వస్వం ధారపోసేందుకు సిద్ధంగా ఉన్నా" అని కోహ్లీ వెల్లడించాడు. వన్డే ప్రపంచకప్‌లో ఉండే ఇంటెన్సిటీ మరే ఇతర టోర్నమెంట్‌లోనూ ఉండదని చెప్పాడు. "ఇందులో దాదాపు



10 మ్యాచ్‌లను టీ20 స్థాయి తీవ్రతతో ఆడాల్సి ఉంటుంది. ఒక వన్డే మ్యాచ్ అనేది 2.5 టీ20లతో సమానం. పెద్ద టోర్నమెంట్ లేదా ప్రపంచకప్‌లో వరుసగా 10 మ్యాచ్‌లపాటు ఆ ఇంటెన్సిటీని కొనసాగించడం చాలా పెద్ద విషయం." అని తెలిపాడు.

**అదే అసలైన సవాలు: రోహిత్ శర్మ**

మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ.. "నేను చేయాల్సిన పని పూర్తయిందనే ఆలోచన ఎప్పుడూ రాదు. ఆడుతున్నంత కాలం.. ఏదో ఒక లక్ష్యం కోసం ఎదురుచూస్తూనే ఉంటాం. ప్రస్తుతం ప్రపంచకప్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ప్రపంచకప్ లేదా ఏదైనా ఐసీసీ టోర్నమెంట్ ఆడేటప్పుడు వేర్వేరు వేదికలపై.. వేర్వేరు ప్రత్యర్థులను ఎదుర్కొంటాం. కాబట్టి, అందుకు తగినట్లు విభిన్నంగా సిద్ధం కావాలి. కొత్తగా ఆలోచించాలి. అదే అసలైన సవాలు" అని పేర్కొన్నాడు. రాబోయే వన్డే వరల్డ్‌కప్ వరకు ఆడతారా? లేదా? అనే సందేహాలకు ఈ ఇద్దరు తమ వ్యాఖ్యలతో తాజాగా చెక్‌పెట్టినట్లయ్యింది.

# కబడ్డీలో భారత్‌కు డబుల్ బొనాంజా..

అబ్బాయిలూ 'పసిడి' పట్టేశారు



ఆసియా క్రీడల కబడ్డీలో మన అమ్మాయిలు, అబ్బాయిలు ఇరాన్‌ను గట్టిగానే ఢీకొట్టారు. ఇప్పటికే ఆ దేశాన్ని ఓడించి మహిళల జట్టు స్వర్ణాన్ని దక్కించుకోగా.. పురుషుల జట్టు అదే బాటలో నడిచింది. ఉత్కంఠగా జరిగిన ఫైనల్లో పసిడి కూత పెట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్.. ఇరాన్‌ను 40-34 పాయింట్ల తేడాతో ఓడించింది. దీంతో కలిపి ఆసియా క్రీడల చరిత్రలో కబడ్డీ జట్టు తొమ్మిదిసార్లు బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. 2026 ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇది నాలుగో స్వర్ణం.

**పతకాల పట్టికలో 10వ స్థానం..**

2026 ఆసియా క్రీడల్లో ఇప్పటివరకు నాలుగు స్వర్ణాలతో భారత్ పతకాల పట్టికలో 10వ స్థానంలో నిలిచింది. 11 రజతాలు, 13 కాంస్యాలతో కలిపి మొత్తం 28 పతకాలను సొంతం చేసుకుంది. మహిళల క్రికెట్ ఫైనల్‌లో హర్మన్ ప్రీత్ సేన అద్భుత విజయంతో తొలి స్వర్ణాన్ని దక్కించుకోగా.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి సింగ్, కమల్‌జీత్ జంట శుక్రవారం పసిడి సొంతం చేసుకున్నారు. ఇక, శనివారం కబడ్డీలో రెండు స్వర్ణాలు వచ్చాయి.

2022 ఆసియా క్రీడల్లో భారత్‌కు మొత్తం 106 పతకాలు వచ్చాయి. వాటిలో 28 గోల్డ్‌మెడల్స్. ఈసారి భారత్ నాలుగో స్థానంలో నిలవగా.. చైనా తొలి స్థానంలో నిలిచింది.

# అమ్మాయిల పసిడి కూత..

ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో గోల్డ్



జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల పతకాల పట్టికలో భారత్‌కు మూడో స్వర్ణం వచ్చి చేరింది. కబడ్డీ పోటీల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన మన అమ్మాయిలు.. ఫైనల్‌లో ఇరాన్‌ను ఓడించి బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. నువ్వా నేనా అన్నట్టు సాగిన ఈ గేమ్‌లో 37-34 తేడాతో మన జట్టు ఇరాన్ నుంచి విజయాన్ని లాగేసుకుంది. మరోవైపు రైఫిల్ షూటింగ్‌లో రజతం దక్కగా.. స్క్వాష్ జోడీ సెమీస్‌లో తడబడి, కాంస్యంతో సరిపెట్టుకుంది.

50 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో తిలోత్తమా సేన్, విదర్శ వినోద్, ఆషి చౌక్సే రజతాన్ని సొంతం చేసుకున్నారు. ఈ పోటీల్లో చైనా బృందం 1773 పాయింట్లతో పసడి పతకాన్ని దక్కించుకోగా.. భారత బృందానికి 1763 పాయింట్లు రావడంతో రెండో స్థానంలో నిలిచింది. 1754 పాయింట్లు సాధించిన కజకిస్థాన్‌కు కాంస్యం దక్కింది.

ఇక, స్క్వాష్ విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్ జోడి జోష్న చిన్నప్ప-సెంథిల్ కుమార్‌కు కాంస్య పతకం దక్కింది. సెమీస్‌లో హాంకాంగ్ ద్వయం లీ కా యి, తాంగ్ మింగ్ హాంగ్ చేతిలో ఓడింది.

అంతకుముందు, భారత అథ్లెట్, హవల్దార్ సావన్ బర్వాల్ మారథాన్‌లో చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో రజతంతో మెరిసి 44 ఏళ్ల తర్వాత మన దేశానికి పతకం అందించాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com